క్లుప్తంగా

స్పందన వినతులపై సత్వర చర్యలు



వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ మాధవరెడ్డి

కావలి: ప్రజల నుంచి స్పందన కార్యక్రమంలో అందించే వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర చర్యలు తీసుకుంటామని కావలి తహసీల్దార్ కె.మాధవరెడ్డి తెలిపారు. సోమవారం కార్యాలయంలో జరిగిన స్పందనలో కావలి టౌన్, మండలంలోని గ్రామాల నుంచి భూసమస్యలకు సంబంధించి పలువురు అర్జీలు అందజేశారు. ఆయా సమస్యలను సుదీర్ఘంగా చర్చించి వాటి పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు వినతి పత్రాలు అందజేశారు.

విద్యా సామగ్రి పంపిణీ



నారంపేట విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

ఆత్మకూరురూరల్: మండలంలోని నారంపేట ఎంపీపీఎస్ పాఠశాలలో గ్రామానికి చెందిన ప్రవాస భారతీయులు గంధం వెంకటేశ్వర్లు పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, ప్యాడ్‌లు, పెన్సిళ్లు, పెన్నులు తదితర విద్యోపకరణాలు పంపిణీ చేశారు. తమ గ్రామ పాఠశాల విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులకు సంబంధించి భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చేరెడ్డి నరేంద్రరెడ్డి, పీఎంసీ చైర్మన్ గంధం పెంచలరావు, హోలిక్రాస్ అసోసియేషన్ ప్రతినిధి గార్ల సునీల్‌రాజ్, అనిల్, జావేద్, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

గంధ మహోత్సవంలో భారీ అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య తదితరులు

ఆత్మకూరు: పట్టణంలోని బీఎస్సార్ సెంటర్‌లో ఉన్న సుల్తాన్ షాహీద్ దర్గాలో గంధమహోత్సవం సోమవారం రాత్రి జరగనున్న నేపథ్యంలో భారీ స్థాయి అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గంధమహోత్సవానికి, అన్నదానానికి ఆర్థిక వితరణ చేసిన విషయం తెలిసిందే. దర్గాలో వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, వైస్ చైర్మన్ షేక్ సర్దార్ పలువురు పార్టీ మైనార్టీ నాయకులతో కలిసి దర్గాలో తొలుత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం దర్గా ఆవరణలో పేదలకు భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ నిర్వాహకులు షేక్ రిజ్వాన్, రహీం, కలాం, అబ్దుల్లా, వశీమ్, బాదుల్లా, కౌన్సిలర్లు మహబూబ్‌బాషా, పి పెంచలయ్య పాల్గొన్నారు.

విద్యతోనే భవిష్యత్

- విద్యార్థికి నగదు బహూకరణ



విద్యార్థికి నగదు పురస్కారం అందజేత

అనుమసముద్రంపేట: విద్యతోనే అన్ని రంగాల్లో భవిష్యత్ ఉంటుందని ఏఎస్‌పేట ఠాగూర్ పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్ వెంకట రమణారెడ్డి, హెచ్‌ఎం కె.దొరస్వామిరెడ్డి అన్నారు. 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి బొమ్మంచు శ్రీహరికి సోమవారం పాఠశాల పూర్వ విద్యార్థులు పానుగోటి మధుసూదన్ రెడ్డి, పానుగోటి మహేష్‌రెడ్డి రూ.10 వేల నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ తాము ఈ పాఠశాలలో చదివి ఉన్నత స్థితిలో నిలిచామని, రెండేళ్లుగా 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం దొరస్వామిరెడ్డి మాట్లాడుతూ చదివిన పాఠశాలను మరచిపోకుండా ఇలా ప్రతి ఏడాది ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థికి నగదు బహుమతి అందజేయడం అభినందనీయమన్నారు. మాజీ సర్పంచ్, జేసీఎస్ కో ఆర్డినేటర్ పులిమి వెంకటరమేష్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రొట్టెల పండగ

ఉదయగిరి: ఉదయగిరి పెద్ద చెరువులో సోమవారం రొట్టెల పండగను పట్టణ వాసులతో పాటు దాసరపల్లి, మాసాయిపేట, గండిపాళెం తదితర గ్రామాలకు చెందిన హిందూ, ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని రొట్టెలు మార్చుకున్నారు. చదువు, ఉద్యోగం, ఆరోగ్య రొట్టెలకు మంచి గిరాకీ ఏర్పడింది. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అన్నదానంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉదయగిరి చెరువులో నీరు లేకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీరు తీసుకెళ్లి గుంతల్లో నింపి రొట్టెలు మార్చుకున్నారు.

రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- ఆగస్టు 10న రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ఆత్మకూరు పర్యటన



బ్రాహ్మణపల్లిలో రెవెన్యూ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో ఇంటింటి సర్వే చేపట్టడం ద్వారా రెవెన్యూ సమస్యలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని తన నివాసంలో సోమవారం ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి, ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారితో కలిసి ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణకు అన్ని మండలాల తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 10న రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాద్‌రావు ఆత్మకూరులో రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. మండలాల వారీగా ఇప్పటికే గుర్తించి రెవెన్యూ సమస్యల పరిష్కారంపై తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో లోతైన చర్చ సాగించారు. ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ శతాబ్ద కాలానికిపైగా భూముల రీసర్వే ప్రక్రియ దేశ వ్యాప్తంగా నిలిచిపోయిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూముల రీసర్వే ప్రక్రియ ప్రారంభించడంతో హక్కుదారులు అందరికీ శాశ్వత హక్కుపత్రాలు లభించనున్నాయని, అదే సమయంలో కొంత మందికి నష్టం కలిగే అవకాశాలు ఉన్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సమయంలో ప్రతి గ్రామం నుంచి సగానికిపైగా రెవెన్యూ సమస్యలే ప్రజల నుంచి వస్తున్నాయన్నారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో స్థానిక వీఆర్‌ఓలు, వలంటీర్లు, ప్రతి ఇంటింటికి వెళ్లి రెవెన్యూ సమస్యల జాబితాను రూపొందించాలని సూచించారు. ఆ నివేదికలను ఈ నెల 10న మంత్రి ధర్మాన దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లోగా రెవెన్యూ సమస్యలపై ప్రతి నెలా ఇలాంటి సమీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రధానంగా చుక్కల భూముల సమస్యలు పరిష్కరించి అర్హులందరికీ మంత్రి చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రాలు అందించేందుకు రెవెన్యూ అధికారులు సహకరించాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, ఉద్యోగులు, వలంటీర్లతో ఆత్మకూరులో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. ఆర్డీఓ సాధు కరుణకుమారితో పాటు పలువురు తహసీల్దార్లు రెవెన్యూ సమస్యల పరిష్కారంలో క్షేత్రస్థాయిలో అనేక చిక్కుముడులు ఉన్నాయని, పరిష్కరించడం చాలా కష్టంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మర్రిపాడు తహసీల్దారు ఆనందరావు మాట్లాడుతూ మండలంలో 17 సచివాలయాలు, 21 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 4 గ్రామాలకు ఒక వీఆర్‌ఓ సేవలు అందిస్తున్నారన్నారు. మండలంలోని ఇర్లపాడు, చాబోలు, పడమటినాయుడుపల్లి, చుంచులూరు గ్రామాల్లో గ్రామ నుడికట్టు విస్తీర్ణం కంటే అధికంగా రెవెన్యూ భూములు రికార్డుల్లో నమోదు అయ్యాయన్నారు. ఆయా గ్రామాల రైతులు లోకాయుక్త, విజిలెన్స్ విచారణలకు సైతం వెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో మాట్లాడిన అనంతసాగరం తహసీల్దారు టి.ప్రదీప్, ఏఎస్‌పేట తహసీల్దారు రమణారావు తదితరులు రెవెన్యూ సమస్యల సర్వేపై పురోగతిని వివరించారు. కార్యక్రమంలో చేజర్ల, ఆత్మకూరు, అనుమసముద్రంపేట ఎంపీపీలు తూమాటి విజయభాస్కర్‌రెడ్డి, కేతా వేణుగోపాల్ రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, జెడ్పీటీసీలు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, మున్సిపల్ చైర్మన్ గోపారపు వెంకట రమణమ్మ, కమిషనర్ నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఆత్మకూరు పట్టణ కన్వీనర్ అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, సొసైటీ చైర్మన్లు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, సోమల మాధవ రెడ్డి, వివిధ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



సంగసానిపల్లిలో లబ్ధిదారులకు బుక్‌లెట్లు అందజేస్తున్న మేకపాటి రాజారెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి

సీతారామపురం: పేదలను అన్ని రకాలుగా ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి అన్నారు. ఆయన సోమవారం సీతారామపురం బిట్-2 సచివాలయ పరిధిలోని నారాయణప్పపేట, సంగసానిపల్లి, పండ్రంగి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ప్రతి కుటుంబం జగనన్న పాలనలో లబ్ధి చేకూరుతోందని లబ్ధిదారులకు వివరించి బుక్‌లెట్లు అందజేశారు. టీడీపీ పాలనలో కేవలం పచ్చచొక్కాలు వేసుకున్న వారికే సంక్షేమ పథకాలు అందేవని, జగనన్న సీఎం అయ్యాక అర్హులందరికీ పథకాలు అందిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని అందరం కలిసి కట్టుగా ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అందలం ఎక్కించడమే కాకుండా ఆర్థికంగా, రాజకీయంగా వారికి పెద్దపీట వేసి వారి ముఖాల్లో వెలుగులు నింపారన్నారు. జగనన్న వల్లే మహిళా సాధికారత సాధ్యమన్నారు. మహిళల కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో చేస్తున్నా.. ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఎల్లో మీడియా బురద జల్లుతూ దుష్ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు మాదిరిగా జగన్ మహిళలను మోసం చేయడం లేదన్నారు. నారాయణప్పపేటలో తమకు ఇళ్లు మంజూరు కాలేదని పలువురు సమస్యను మేకపాటికి దృష్టికి తీసుకెళ్లారు. త్వరితగతిన సమస్య తీర్చాలని అధికారులకు సూచించారు. పండ్రంగి ఎస్టీ కాలనీలో నీటి సమస్య ఉందని గ్రామస్తులు ఆయనకు తెలపగా తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, మాజీ ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చప్పిడి తిరుపతిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనరు బాలినేని మాబయ్య, ఉదయగిరి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కి భాస్కర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కల్లూరి రమణారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గుర్రం సుబ్బయ్య, ఈరి ప్రసాద్, ఓబులేశు, రామచంద్ర, తిరుపాలు, వెంకటరెడ్డి, సీనియర్ నాయకుడు గాజులపల్లి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉండండి

- సోమశిల జలాశయాన్ని పరిశీలించిన
- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



సోమశిల జలాశయం వద్ద పనుల డిజైన్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

చేజర్ల(సోమశిల): రాబోవు వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదలు వచ్చే అవకాశం ఉన్నందువల్ల సోమశిల జలాశయం అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన సోమశిల జలాశయాన్ని సందర్శించారు. సోమశిల జలాశయం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బొమ్మిరెడ్డి దశరథరామిరెడ్డి ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి నీటి నిల్వ,నీటి విడుదల, నీటి లభ్యత తదితర విషయాలు వివరించారు. అధికారులతో మాట్లాడి రెండో పంటకు నాన్‌డెల్టా పరిధిలోని ఉత్తర కాలువకు రైతులకు సాగు నీరిందించే విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. భవిష్యత్‌లో వరదలు వచ్చినా ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టేలా కృషి చేస్తామన్నారు. ఆప్రాన్ పనులను పరిశీలించారు. క్రస్ట్ గేట్లు, రబ్బరు సీళ్ల సంబంధిత నిర్వహణ ప్రక్రియ ఎప్పటికప్పుడు చేయాలన్నారు. రాబోవు వర్షాకాలంలో గతేడాది కంటే మరింత ప్రవాహం వచ్చినా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఈఈ క్రస్ట్ గేట్ల నుంచి కుడి దక్షిణ గోడ (రైట్ సైడ్ రిటైనింగ్ వాల్) ఎత్తు పెంపు కార్యక్రమం జరుగుతుందని, ఇందుకు సంబంధించి డిజైన్స్ సిద్ధం చేసామన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ కరిముల్లా

సంగం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న కాలనీల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించినట్లు సంగం గృహ నిర్మాణశాఖ ఏఈ కరిముల్లా అన్నారు. సోమవారం సంగం తిరుమనతిప్ప వద్ద జగనన్న ఇళ్ల కాలనీలను ఆయన పరిశీలించారు. పలువురు లబ్దిదారులతో మాట్లాడి నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల కాలనీల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. నాణ్యతలో రాజీ లేకుండా నిర్మాణాలు జరిగేలా చూస్తున్నామన్నారు. ఈ కాలనీలో గృహ నిర్మాణాలు పూర్తయితే మినీ విలేజ్‌గా తయారవుతుందన్నారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

వాహనాల వేలం

ఉదయగిరి: ఉదయగిరి సెబ్ కార్యాలయ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను సోమవారం సెబ్ అధికారులు వేలం నిర్వహించారు. ఈ వేలంలో పలు వాహనాలను కొందరు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెబ్ అధికారులు రవికుమార్, మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న సెబ్ అధికారులు

నవోదయ కోచింగ్ ప్రారంభం



ఉదయగిరి: మండలంలోని పుల్లాయపల్లి ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో సోమవారం 2024 నవోదయలో ప్రవేశం కోసం కోచింగ్ ప్రారంభించారు. విద్యార్థులకు ఎంట్రన్స్ టెస్ట్ మెటీరియల్‌తో పాటు వివిధ సామగ్రిని విశ్రాంత ఉపాధ్యాయుడు కేవీ రత్నం అందజేశారు. ఉపాధ్యాయులు గాజులపల్లి సుబ్బారెడ్డి, ఎస్‌కే ఖాదర్‌బాషా, ఆదిలక్ష్మి, ప్రశాంతకుమారి పాల్గొన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన ఆర్డీఓ



డీసీపల్లి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ కరుణకుమారి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని డీసీపల్లి సచివాలయాన్ని ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయం సిబ్బంది మూవ్‌మెంట్ రిజిస్టర్లు పరిశీలించి గైర్హాజరైన వారి వివరాలు నమోదు చేశారు. ప్రజలకు అవసరమైన సేవలు సకాలంలో అందించాలని ఆదేశించారు. గ్రామస్తులు ఆర్డీఓను కలిసి తమ గ్రామంలో బ్రిటిష్ హయాంలో నిర్మించిన పోలీసుస్టేషన్‌లో మండల వ్యవస్థ ఏర్పాటు తర్వాత మర్రిపాడుకు తరలించారని ఖాళీగా ఉన్న పోలీసుస్టేషన్ స్థలాన్ని స్థానిక పాఠశాల క్రీడా ప్రాంగణంగా కేటాయించాలని కోరారు. ఈ విషయమై తగు వివరాలతో నివేదికలు పంపాలని మర్రిపాడు ఆర్‌ఐ సురేంద్రను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ గౌస్‌బాషా, వెల్ఫేర్ అసిస్టెంట్ అశోక్, సాంకేతిక సహాయకుడు నాగార్జున, మహిళా పోలీసు సురేఖ తదితరులు పాల్గొన్నారు.

పండరీపురంలో భజనకు అవకాశం



పండరీపురంలో భజన చేస్తున్న మాముడూరు భజన బృందం

చేజర్ల: మండలంలోని మాముడూరుకు చెందిన భజన బృందానికి మహారాష్ట్రలోని పండరీపురంలో భజన వేసే అవకాశం వచ్చింది. పాండురంగస్వామి భజన కళాకారుల సంక్షేమ సంఘం బృందానికి అక్కడ భజన వేసే అవకాశం వచ్చిందని వ్యవస్థాపకుడు గుండాల పెంచలరెడ్డి తెలిపారు. చేజర్ల మండలంలోని పలు ప్రాంతాలకు చెందిన భజన కళాకారులు అక్కడ భజన వేశారు.

మణిపూర్ ఘటనపై క్రైస్తవ సంఘాల ర్యాలీ



కావలిలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాలు



శాంతి ప్రదర్శన నిర్వహిస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

- నిందితులను కఠినంగా శిక్షించాలి

కావలి: మణిపూర్లో మహిళలపై జరిగిన లైంగికదాడులు, హత్యలను నిరసిస్తూ పట్టణంలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. స్థానిక ఏబీఎం నుంచి ట్రంక్‌రోడ్డు మీదుగా జెండా చెట్టు వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో మానవహారంగా నిలబడి, కొవ్వొత్తులతో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి, లైంగికదాడి జరిపిన ఘటనకు సంబంధించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సంఘాల బాధ్యులు మాట్లాడుతూ అనాగరిక చర్యలు ప్రస్తుత సమాజంలో మళ్లీ పునరావృతం కావడం సిగ్గు చేటన్నారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పేందుకు రాష్ట్రపతి స్పందించాలన్నారు. ఇలాంటి ఘటనలు భారతదేశ కీర్తి ప్రతిష్టలను దిగజార్చుతున్నాయన్నారు. తక్షణమే నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లను నివారించి తక్షణమే శాంతిని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారీగా క్రైస్తవులు పాల్గొన్నారు.

క్రైస్తవ సంఘాల శాంతి ప్రదర్శన

దుత్తలూరు: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోమవారం దుత్తలూరులో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవ కుటుంబాలు, ఆదివాసీలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. మణిపూర్‌లో హింసాకాండ నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. అక్కడ ప్రభుత్వ అండదండలతోనే దాడులు జరుగుతున్నాయన్నారు. అక్కడ జరుగుతున్న మారణకాండ భారతదేశం తలదించుకునేలా ఉందన్నారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని మండలంలోని పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

మారణహోమాన్ని అరికట్టండి

ఆత్మకూరు: మణిపూర్‌లో రెండు నెలలకుపైగా మారణకాండ జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం, ఆ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా వినోదం చూస్తున్నాయని వెంటనే కఠిన చర్యలు తీసుకుని దోషులను శిక్షించాలని వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనలకు నిరసనగా పౌర హక్కుల వేదిక ఆధ్వర్యంలో సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, కేవీపీ, రైతు కూలి సంఘం తదితర పార్టీల నాయకులు, కార్యకర్తలు సోమవారం ఆత్మకూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ డిపో వద్ద నుంచి మున్సిపల్ బస్టాండ్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వరకు సాగిన ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధులు మీదుగా సాగింది. అంబేడ్కర్ విగ్రహం వద్ద మణిపూర్ మారణకాండ దారుణాన్ని వక్తలు వివరించారు. ఇప్పటికే దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నా కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్కు ప్రసాద్, ఎ నాగయ్య, డేవిడ్‌రాజు, లాయర్ కేవీ శేషారెడ్డి, బీఎస్పీ ఇన్‌చార్జి నందా ఓబులేసు, సూరా భాస్కర్‌రెడ్డి, వన్నెం నాగరాజు, సయ్యద్ జమీర్, ఐద్వా మహిళలు గుల్జార్ బేగం, పద్మ, అనిత, పాల్గొన్నారు.



మణిపూర్ ఘటనకు వ్యతిరేకంగా ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

డాక్టర్ సుబ్బారెడ్డి సేవలు మరువలేనివి

- డీసీహెచ్‌ఎస్ రమేష్



డాక్టర్ ఎంవీ సుబ్బారెడ్డి, భారతి దంపతులను సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా, అనస్టీస్ట్‌గా విధుల్లో అంకిత భావంతో పని చేసిన డాక్టర్ సుబ్బారెడ్డి సేవలు మరువలేనివని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయాధికారి (డీసీహెచ్‌ఎస్) రమేష్ అన్నారు. సోమవారం డాక్టర్ సుబ్బారెడ్డి పదవీ విరమణ చేయడంతో ఆయన్ను ఆస్పత్రి వైద్యులు, నెల్లూరు జీజీహెచ్ వైద్యులు, సిబ్బంది ఆస్పత్రి ప్రస్తుత సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డీసీహెచ్‌ఎస్ మాట్లాడుతూ నెల్లూరు, కావలి, ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రుల్లో డాక్టరుగా సుబ్బారెడ్డి విశేష సేవలు అందించారన్నారు. కోవిడ్ సమయంలో ఆత్మకూరు ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా అందించిన సేవలకు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు, అవార్డులు లభించాయన్నారు. ఆయన నేతృత్వంలోనే రాష్ట్ర స్థాయిలో ఆత్మకూరు ఆస్పత్రికి కాయకల్ప అవార్డు రెండో సారి దక్కిందని, ఇది ఆయన కృషికి నిదర్శనమన్నారు. నెల్లూరు జీజీహెచ్ సీనియర్, విశ్రాంత వైద్యులు ప్రసాద్, కృష్ణమూర్తి, చెన్నయ్య తదితరులు పాల్గొని సుబ్బారెడ్డితో తమతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. పూలమాలలు, శాలువాలు, బొకేలతో సుబ్బారెడ్డి, భారతి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్‌ఎంఓ డాక్టర్ ఉషాసుందరి, నర్సింగ్ సూపరింటెండెంట్ కృష్ణకుమారి, డాక్టర్లు బాలాజీ, నరసింహశాస్త్రి, శశి, చైతన్య, శ్రావణ్య, బెట్టి, బెన్ని, విశ్రాంత డీసీహెచ్‌ఎస్ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మపాలు అమృతం

- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- బాలింతలకు గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు



అంగన్‌వాడీలో తల్లిపాల ఆవశ్యకత, పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

జలదంకి: బిడ్డ ఆయుష్షు, ఆరోగ్యం, దృఢత్వానికి తల్లి ముర్రుపాలు దోహదపడుతాయి. అందుకే అమ్మ పాలు అమృతంతో సమానం అంటారు. ఏటా ఆగస్టు 1 నుంచి వారం రోజుల పాటు అంగన్‌వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తారు. బిడ్డకు తొలి ఆహారం అమ్మపాలు. ఇది ప్రకృతి వరమని, దీనికి ఏదీ సాటి రాదని చెబుతుంటారు. కొన్ని అపోహలు, ఆధునిక పోకడలతో కొందరు తల్లులు వారి బిడ్డలకు శ్రేష్టమైన తల్లిపాలను దూరం చేస్తున్నారు. దీంతో శిశు మరణాలు పెరుగుతున్నాయి. దీంతో తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ ప్రభుత్వం ఆగస్టు మొదటి వారంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

వారోత్సవాల లక్ష్యం ఇదే

సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల ప్రాముఖ్యత, ముర్రుపాలతో కలిగే ప్రయోజనాలు. తల్లులు, గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాహారం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు, చేపట్టనున్నారు.

తల్లిపాలలో ఔషధ గుణాలు

పుట్టిన శిశువుకు గంట లోపే తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. మలేరియా, టైఫాయిడ్, కామెర్లు తదితర వ్యాధులను నిర్మూలించే ఔషధ గుణాలు తల్లిపాలలో ఉన్నాయి. బిడ్డ బరువు పెరిగేందుకు, ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిపాలు దోహదపడతాయి. తల్లి ఒడిలో వేడి బిడ్డకు చేరి వ్యాధులు దరిచేరకుండా రక్షణ కల్పిస్తోంది. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగిస్తే శిశు మరణాలు తగ్గుతున్నట్లు అధ్యయనాల ద్వారా వెల్లడైంది. ప్రస్తుతం అనేక మంది తల్లులు రొమ్ము కేన్సర్ బారిన పడుతున్నారు. దీనికి ముఖ్య కారణం బిడ్డలకు పాలు ఇవ్వకపోవడమేనని పరిశోధనల్లో కూడా వెలుగుచూసింది. శిశువుకు తొలి 6 నెలలు బిడ్డలకు పాలివ్వడం ద్వారా రొమ్ము కేన్సర్ బారిన పడే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయి. వారం రోజుల పాటు జరిగే తల్లిపాల వారోత్సవాల్లో గర్భిణులు, బాలింతలు ఐసీడీఎస్ సిబ్బంది అందించే పౌష్టికాహార నియమాలు, తల్లిపాల ఆవశ్యకతను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆరు నెలలు తల్లిపాలు ఇవ్వాలి



పుట్టిన బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వాలి. బాలింతలు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా రోజుకు 8 నుంచి 10 సార్లు బిడ్డకు పాలు ఇవ్వాలి. బిడ్డకు పాలు పడుకుని ఇవ్వరాదు. కూర్చొని పాలు ఇవ్వాలి. ఆరు నెలల వరకు తల్లిపాలు అందిస్తే బిడ్డ ఆరోగ్యంగా, దృఢంగా పెరుగుతుంది.

– రాజేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, జలదంకి మండలం

తల్లిపాల ఆవశ్యకత వివరిస్తున్నాం



అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్నాం. తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నాం. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. తల్లిపాల వారోత్సవాల్లో కేంద్రాల్లో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నాం.

– అరుణ, అంగన్‌వాడీ కార్యకర్త, జువ్విచెట్టుపాళెం

యూటీఎఫ్ నేతలు వైఎస్సార్‌టీఎఫ్‌లో చేరిక



వైఎస్సార్‌టీఎఫ్ క్యాలెండరును ఆవిష్కరిస్తున్న నాయకులు

కొండాపురం: వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కొండాపురం మండలం యూటీఎఫ్‌లో క్రియాశీలకంగా ఉన్న ఎం.మాధవరెడ్డి, ఎం.శ్రీనివాసులు సోమవారం వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సుదర్శనం సమక్షంలో చేరారు. మండలంలోని పార్లపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ కొండాపురం యూటీఎఫ్ నాయకులు వైఎస్సార్ టీఎఫ్‌లో చేరడం మంచి పరిణామమన్నారు. అనంతరం ఏపీ వైఎస్సార్ టీఎఫ్ క్యాలెండరును ఆవిష్కరించారు. వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా నాయకులు బుర్రి వెంకటేశ్వర్లు, కావలి మండల ప్రధాన కార్యదర్శి ఎం భాస్కర్ నారాయణ పాల్గొన్నారు.